క్లుప్తంగా

క్రీడల్లో సత్తా చాటిన చిట్టమూరు విద్యార్థులు


ఎంపికైన క్రీడాకారులతో పీడీ భరత్

చిట్టమూరు: డివిజన్ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పిడుగు భరత్ మహీపతి బుధవారం తెలిపారు. గూడూరులో జరిగిన క్రీడా పోటీల్లో బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్‌లో గునపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వాలీబాల్(బాలురు), జట్టు, చిట్టమూరు, మల్లాంకు చెందిన విద్యార్థులు కబడ్డీ(బాలురు), జట్టు ఫైనల్‌లో విజయం సాధించి జిల్లా స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించారన్నారు. ఆరూరు, మెట్టు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఖోఖో, కబడ్డీ పోటీల్లో రాణించి జిల్లా స్థాయిలో ఎంపికైనట్లు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ


గురుకుల పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మునిరత్నం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఎంఈవో బాణాల మునిరత్నం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురుకులంలో విద్యార్థులు నిద్రించే గదులు, మరుగుదొడ్లు, భోజనశాల ప్రాంతాలను పరిశీలించారు. ప్రిన్సిపల్ సుబ్బారావుతో ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులకు శుభ్రమైన ఆహారాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా వంటశాలలో విద్యార్థులతో పనులు చేయించరాదని చెప్పారు. విద్యార్థులతో మాట్లాడి చదువుపై శ్రద్ధ వహించి ఉన్నతంగా రాణించాలని ఎంఈఓ సూచించారు.

గిరిజన విద్యార్థులకు దుస్తుల పంపిణీ


విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎంఈఓ కేఎంఎస్ సునీల

సూళ్లూరుపేట: పట్టణంలోని సాయినగర్ గిరిజన కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 65 మంది విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారు దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం నూతన వస్త్రాలు మండల విద్యాశాఖాధికారి కేఎంఎస్ సునీల చేతుల మీదుగా అందజేశారు. ఏడేళ్ల నుంచి ఈ స్కూల్లో ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది దీపావళి పండుగను చేసుకునేందుకు ఈ నిరుపేద గిరిజన విద్యార్థులకు నూతన వస్త్రాలు, టపాసులు అందజేశారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

గూడూరురూరల్: జీడీఎస్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే నినాదంతో హక్కుల కోసం పోరాడిన ఏఐజీడీఎస్‌యూ జనరల్ సెక్రటరీ ఎస్.ఎస్.మహదేవయ్యను సర్వీస్ నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని డివిజనల్ ఆఫీసు వద్ద బుధవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సెక్రటరీ కామ్రేడ్ బి.గోపాల్, సర్కిల్ అసిస్టెంట్ ట్రెజరర్ కామ్రేడ్ మల్లికార్జున, పెన్షనర్ సెక్రటరీ కె.సుధాకర్, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ఆదాయ వనరులను గుర్తించాలి

ఓజిలి: పంచాయతీలలో సొంత ఆదాయ వనరులకు గుర్తించి పంచాయితీ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో రెండో రోజు ఓన్ సోర్స్ రెవెన్యూ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇంటి, నీటి పన్నులను వసూళ్లు చేసి మౌళిక వసతులు కల్పించాలన్నారు.

చికెన్ ధరలు 16-10-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	125
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	226
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	250
లేయర్ చికెన్	:	207

వైద్యవిద్య ప్రైవేటీకరణపై ఉద్యమం


కొత్తపాళెం రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్


జరుగుమల్లిలో సంతకాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి
- పేద విద్యార్థులకు అండగా వైఎస్సార్‌సీపీ
- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని, దీనిపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. మండలంలోని జరుగుమల్లి, కొత్తపాళెం గ్రామాల్లో బుధవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. జరుగుమల్లిలో పార్టీ నాయకులు ఉలస కస్తూరయ్య, బుజ్జయ్య ఆధ్వర్యంలో రచ్చబండ వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గొప్ప ఆశయంతో గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు తీసుకువచ్చినట్లు తెలిపారు. మన పేదబిడ్డలు పక్క రాష్ట్రాలకు వెళ్లి ఎక్కువ ఫీజులు చెల్లించి వైద్యవిద్యను అభ్యసించలేరని భావించిన జగనన్న వారి కోసం పోరాటం చేసి మెడికల్ కళాశాలలను సాధిస్తే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేటీకరించాలని చూడడం సిగ్గుచేటన్నారు. వైద్య విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. విద్యార్థుల కోసం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తూ సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు.

కొత్తపాళెంలో..

కొత్తపాళెంలో పార్టీ నాయకులు నేదురుమల్లి హరీష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులు ఏ విధంగా నష్టపోతారో వివరించారు. ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ వివరించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, సర్పంచ్ ప్రసన్న, విమలాకర్‌రెడ్డి, పాదర్తి రాధాక్రిష్ణారెడ్డి, సాయిరెడ్డి, మహిళా కన్వీనర్ రేష్మ, రాఘవరెడ్డి, నాగూర్‌రెడ్డి, రాజారెడ్డి, శశిరెడ్డి , నారాయణరావు, విజయశేఖర్‌రెడ్డి, సురేంద్ర, అరవింద్ పాల్గొన్నారు.

పెంచలకోనలో కాకాణి


పెంచలకోన దేవస్థానం వద్ద కాకాణి గోవర్ధనరెడ్డి

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని బుధవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్వామి వారికి తలనీలాలు సమర్పించి, మూడు ఆలయాల్లోని దేవతలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను ఆలయ ఏసీ శ్రీనివాసులరెడ్డి స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, వేదపండితుల ఆశీర్వచనాలు ,ప్రసాదాలు అందించారు. ఆయన వెంట రాపూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లూరు శివకుమార్‌రెడ్డి, గోనుపల్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

నేడు సంతకాల సేకరణ

గూడూరురూరల్ : పట్టణంలోని 4, 5 వార్డులకు సంబంధించి సనత్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

నకిలీ మద్యం విక్రయిస్తే ఉపేక్షించేది లేదు


సీఐ అరుణ కుమారి

నాయుడుపేటటౌన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజి లి మండలాల్లో లైసెన్సుల పొందిన మద్యం షాపు ల్లో నకిలీ మద్యం విక్రయాలు జరిపే ఎవరినీ ఉపేక్షించేది ఉండదని సీఐ అరుణ కుమారి హెచ్చరించారు. నాయుడుపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సీఐ విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యం నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీఐ వెల్లడించారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాయుడుపేటలోని 14, మద్యం షాపులతో పాటు ఓజిలిలో 3, పెళ్లకూరులో 3 మద్యం షాపుల్లో నిర్వాహకులచే యాప్ డౌన్‌లోడ్ చేయించినట్లు వివరించారు. ప్రతి మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను యాప్‌తో స్కానింగ్ చేసి విక్రయించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. బుధవారం పలు మద్యం దుకాణాలను పరిశీలించి మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌లను యాప్‌తో స్కానింగ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. నకిలీ మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు అనుమానం వస్తే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చాన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు రంగం సిద్ధం


రహదారి పక్కనే ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకునేందుకు రంగం సిద్ధం చేసి ఉన్నారు. ప్రధాన రహదారి పక్కనే అన్నమేడు సప్లయ్ చానల్ పక్కనే ఇప్పటికే చాలావరకు ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. స్వర్ణముఖి నది వెంబడి ఉన్న అన్నమేడు సప్లయ్ చానల్ ఇరువైపులా చాలావరకు ఆక్రమించేశారు. జాతీయ రహదారి పక్కనే సప్లయ్ చానల్ సమీపంలో దర్జాగా ఆక్రమించేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి.

కూలే స్థితిలో అంగన్‌వాడీ భవనం


కరటాముడి గ్రామంలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం

దొరవారిసత్రం : మండలంలోని కరటాముడి గ్రామం అంగన్‌వాడీ భవనం కూలే స్థితిలో ఉంది. చేసేది లేక శిథిలావస్థకు చేరిన భవనంలోనే కేంద్రాన్ని నడుపుతున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ భవనం బాగా దెబ్బతిని శ్లాబ్ సైతం పెచ్చులు ఊడిపడుతోంది. వర్షం వచ్చినపుడు ఉరుస్తుండడంతో అంగన్‌వాడీ పిల్లలు పలు ఇబ్బందులు పడాల్సివస్తుందని గ్రామస్తులు తెలియజేశారు.

ఉత్తమ బోధనతో ఉన్నత శిఖరాలు


మొక్క నాటుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

ఓజిలి: ఉత్తమ విద్యా బోధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని చిలమానుచేను గ్రామంలోని ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన పీఎం సార్ కిచెన్‌గార్డెన్‌లో మంగళవారం మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి సురేష్, ఎస్ఎంసీ చైర్మన్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాప్‌తోనే మద్యం అమ్మకాలు నిర్వహించాలి

వాకాడు: నకిలీ మద్యం అరికట్టేందుకు ఇకపై అన్ని మద్యం షాపుల్లో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి మద్యం అమ్మకాలు నిర్వహించాలని వాకాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్‌యువీఎస్ ప్రసాద్ అమ్మకం దారులను ఆదేశించారు. ఆయన బుధవారం వాకాడులో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల మద్యం షాపుల అమ్మకం దారులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎ-4 షాపుల్లో సేల్స్ నిర్వహించే ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా బాటిల్ స్కాన్ చేసిన తరువాతే మద్యం విక్రయించాలన్నారు.

రేపు వెంకటగిరిలో సంతకాల సేకరణ

సైదాపురం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం వెంకటగిరిలోని ఎన్‌జీఆర్ భవనంలో సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పార్టీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని రాపూరు, కలువాయి, సైదాపురం, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

పేద మహిళలకు చీరల పంపిణీ


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

వాకాడు: సాయిబాబా మహాసమాధి చెందిన పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ఆనందసాయి నిలయంలో దాతలు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దాతలు కలికి విజయలక్ష్మి(బేబమ్మ), విష్ణుప్రియ కుటుంబ సభ్యుల దాతృత్వంతో వాకాడు, గొల్లపాళెం, చిట్టమూరు గ్రామాలకు చెందిన పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తనకున్న దాంట్లో కొంతైనా ఇతరులకు సాయం చేయడం వల్ల సద్గురువుల ఆశీస్సులు మనపై ఉంటాయని ఆనంద సాయి నిలయం నిర్వాహకురాలు బేబమ్మ అన్నారు. అనంతరం తత్సంగంతోపాటు ధ్యానం తరగతులను మాస్టర్స్ సుధాకర్‌రెడ్డి, కోటిరెడ్డి ప్రారంభించారు.

యాక్షన్ ప్లాన్‌పై సమావేశం

దొరవారిసత్రం: సూళ్లూరుపేట నియోజకవర్గం పీ-4 విజన్ యాక్షన్ ప్లాన్‌పై బుధవారం రాత్రి దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కిరణ్మయి ఎవరికి ఎలాంటి సమాచారం లేకుండా తూతూమంత్రంగా సమావేశం నిర్వహించారు. దీనికి సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్లు హాజరయ్యారు.

23 నుంచి స్కూళ్లల్లో ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి(సైదాపురం): మండంలలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 23వ తేదీ నుండి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 5 నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న వారు బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. సచివాలయాల ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 30 వరకు రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్డులుంటేనే యూరియా

చిల్లకూరు: ప్రతి రైతుకు ఎకరాకు ఒక బస్తా చొప్పున యూరియా అందించేందుకు ఈ ఏడాది రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి గూడూరు భవాని తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం రైతులకు యూరియా గుర్తింపు కార్డులను అందించారు. ఆమె మాట్లాడుతూ యూరియాను మూడు విడతలుగా ఒక ఎకరాకు ఒక బస్తా చొప్పున అందించినున్నట్లు తెలిపారు.

కండలేరులో 59.890 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 59.890 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,550 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,000, పిన్నేరుకాలువకు 300, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 500, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సీహెచ్‌సీ వైద్యశాల తనిఖీ

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని సీహెచ్‌సీ వైద్యశాలను స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం అకస్మకంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో అందిస్తున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రికార్డులను పరిశీలించారు.

షెడ్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


శ్రీహరి(ఫైల్)

చిల్లకూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో జాతీయ రహదారి పక్కనే నూతనంగా నిర్మిస్తున్న ఓ రేకుల షెడ్‌పై నుంచి ఓ వ్యక్తి కింద పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు నెల్లూరు టౌన్ వెంకటేశ్వర పురానికి చెందిన కటకం శ్రీహరి (27) రేకులషెడ్ నిర్మాణ పనులకు వచ్చి పని చేస్తూ పై నుంచి కింద పడి మృతి చెందాడు. యజమాని లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



గూడూరురూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరప్పాడు సమీపం నుంచి గూడూరుకు టిప్పర్లలో మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఇటీవల కాలంలో మైనింగ్ కార్యకలాపాలకు సంబంధించి ఓ సంస్థకు అజమాయిషీ ఇవ్వడంతో ఆ దిశగా సంస్థ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ఉన్న సిబ్బంది మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లపై మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ అధికారులు రెండు టిప్పర్లను సీజ్ చేసి గూడూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

మట్టి సేకరణకు ఆటంకం కలిగించొద్దు


గ్రామస్తులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్


రాఘవేంద్ర మీనాను సత్కరిస్తున్న అధికారులు

చిల్లకూరు: తీర ప్రాంతంలో ఏర్పాటు కానున్న పరిశ్రమల యాజమాన్యాలు చేపట్టే మట్టి నమూనాల పనులకు ఆటంకం కల్పించవద్దని మన్నెగుంట గ్రామస్తులకు గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీన సూచించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆయన మన్నెగుంట గ్రామస్తులు, జిందాల్ పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల పరిశ్రమ యాజమాన్యం వారికి కేటాయించిన భూముల్లో పనులు చేపట్టేందుకు వెళ్లగా అక్కడకు మన్నెగుంట గ్రామస్తులు చేరుకుని పనులు అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం ఆ విషయాన్ని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకు రావడంతో ఆయన గ్రామస్తులను గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి పిలిపించారు. పరిశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులతో సుమారు గంటకుపైగా చర్చలు జరిపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం చేపట్టే ఎలాంటి పనులను అడ్డుకోవద్దని పరిహారం విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని, గ్రామాన్ని రికార్డుల్లో నమోదు చేసేందుకు వెంటనే సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్ఓ ఉదయ్, పరిశ్రమ ప్రతినిధి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు ఘన వీడ్కోలు

సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన ఢిల్లీకి బదిలీపై వెళుతుండడంతో అతనికి గూడూరు డివిజన్ రెవెన్యూ అధికారులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని బూదనం సమీపంలో ఉన్న ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్‌లోని అన్ని మండలాలకు చెంది తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం సబ్ కలెక్టర్ దంపతులకు శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్‌రెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమను ఇచ్చి ఘనంగా సత్కరించారు. గూడూరు ఆర్డీఓగా ఇన్‌చార్జ్ బాధ్యతలను శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు


మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట : గ్రాడ్యుయేషన్ చదువుకోవడానికి కొత్తగా కళాశాల్లోచేరే విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ఎలాంటి ర్యాగింగ్‌కు పాల్పడకుండా స్నేహితుల్లా స్వాగతించాలని సీఐ మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని గోకులకృష్ణా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఎంతోమంది విద్యార్థులు తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసేందుకు కళాశాలలకు వస్తే, వారిని ర్యాగింగ్ పేరుతో వేధిస్తే, అవమానభారంతో నిండు నూరేళ్ల జీవితాలను బలిచేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థిని స్నేహితుడిలా ఆదరించి పలకరిస్తే వారి చదువులు సజావుగా సాగే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కళాశాలల్లో ఈవ్ టీజింగ్ పూర్తి స్థాయిలో మానేయాలని సూచించారు.

అయ్యప్ప స్వాముల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న అయ్యప్పస్వాములు

వెంకటగిరి రూరల్: అయ్యప్పస్వామి మాల ధరించిన అయ్యప్పస్వాములు శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో బుధవారం భిక్షాటన కార్యక్రమం ప్రారంభించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ సమీపం వద్ద ఉన్న వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపం వద్ద ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్తబృంధ భవనం వద్ద అయ్యప్పస్వామి మాల ధరించిన అయ్యప్ప స్వాములకు మండలం కాలం పాటు (41 రోజులు) మధ్యాహ్నం ఉచితంగా భిక్ష ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రతి రోజూ అయ్యప్పస్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. దాతలు విరాళాలు సమర్పించవచ్చని కోరారు.

ఆర్టీసీ బస్సు- బైక్ ఢీ : ఇద్దరి దుర్మరణం

వెంకటగిరి రూరల్ : ఆర్టీసీ బస్సును బైక్ ఢీ కొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన వెంకటగిరి-ఏర్పేడు జాతీయ రహదారిపై ఆంజనేయపురం వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, పాపనపల్లికి చెందిన మణికంఠ (20), పవన్ (19) ద్విచక్ర వాహనంపై నెల్లూరుకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. ఆంజనేయపురం సమీపం వద్ద శ్రీకాళహస్తి నుంచి వెంకటగిరికి వస్తున్న వెంకటగిరి ఆర్టీసీ డిపో బస్సును ఢీకొన్నారు. మణికంఠ అక్కడికక్కడే మృతి చెందగా, పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పవన్‌ను తిరుపతిలోని రుయాకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతులిద్దరూ వరుసకు అన్నదమ్ములు కావడం గమనార్హం. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులు కొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ మేరకు శ్రీకాళహస్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

సూళ్లూరుపేట : భారతదేశం గర్వించదగిన మిస్సైల్ మ్యాన్, భారత మాజీ రాష్ట్రపతి, డీఆర్‌డీఏ చైర్మన్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను పూర్వపు విద్యార్థుల సంఘం వారి ఆధ్వర్యంలో బుధవారం సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంచేలా వివిధ సైన్స్ ప్రాజెక్టులను పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేశారు. అందులో నాలుగు సైన్స్ ప్రాజెక్టులను ఎంపిక చేసి వారికి అవార్డులు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులతో అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇస్రో విశ్రాంత ఉద్యోగి, పూర్వపు విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఇస్రోకి అందించిన సేవలను వివరించారు. పేపర్ బాయ్‌గా ప్రారంభమైన ఆయన జీవితం భారతదేశ ప్రథమపౌరుడు అంటే రాష్ట్రపతి అయినప్పటికీ ఆయనలో ఎక్కడా గర్వమనేది కనిపించకుండా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని అన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల సంఘం జాయింట్ సెక్రటరీ షేక్ ఉస్మాన్ భాషా, సంఘం సభ్యులు పీ శ్రీకుమార్‌రెడ్డి, తేరే వీరయ్య, శ్యాం సుందర్ పాల్గొన్నారు.